బాలికా సంరక్షణ ఏదీ?

- గడువు దాటినా మంజూరు కాని నిధులు
- నిధుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

తాడిపత్రి రూరల్: బాలికల సంరక్షణ పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. గడువు మీరిన బాండ్లకు నిధులు మంజూరులో జాప్యాన్ని నిరసిస్తూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. బాలికల విద్యను ప్రోత్సహించడానికి 2000లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన బాలిక సంరక్షణ పథకానికి 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మార్పులు చేర్పులు చేసి అమలు చేశారు. బీమా ఆధారిత పథకానికి సంబంధించిన జారీ చేసిన బాండ్లు ఇటీవల గడువు ముగిశాయి. బాండ్ల గడువు ముగియడంతో లబ్ధిదారులతో పాటు వారి తల్లి దండ్రులు నిధుల కోసం తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టుకు వచ్చి అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసిన వెంటనే సమాచారం ఇస్తామని చెప్పి పంపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా ఈ పథకానికి సంబంధించి గడువు ముగిసిన బాండ్లకు నిధులు మంజూరు చేయడంలో జాప్యం చేయడాన్ని లబ్ధిదారులు తప్పుపడుతున్నారు.



తాడిపత్రిలో ఐసీడీఎస్ కార్యాలయం

పథకం లబ్ధి ఇలా..

బాలికా సంరక్షణ పథకం కింద తల్లిదండ్రులకు బాలిక ఒక్కరైతే రూ.లక్ష, ఇద్దరు అయితే రూ.60 వేల చొప్పున అందజేస్తారు. అలాగే 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉపకార వేతనం రూ.12,000 జమ చేస్తారు. అంతేకాకుండా సహజ మరణం రూ.30 వేలు, ప్రమాదవశాత్తు క్షతగాత్రులైనా, మరణించినా రూ.75వేలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.37,500 చొప్పున అందజేస్తామని లబ్ధిదారులకు జారీ చేసిన బాండ్లల్లో వివరించారు. అప్పట్లో హైదరాబాద్‌లోని ఎల్‌ఐసీ పీఅండ్ జీఎస్ సంస్థ ద్వారా లబ్ధిదారులకు బాండ్లను జారీ చేయించారు.



పథకానికి సంబంధించిన బాండు

తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టులో వందకు పైగా గడువు ముగిసిన బాండ్లు

బాలిక సంరక్షణ పథకం కింద వందకు పైగా గడువు ముగిసిన బాండ్లు ఉన్నాయి. 2005 నుంచి 2013 వరకూ ఈ పథకం కింద లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుని బాండ్లను మంజూరు చేసింది. తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 1400 మంది వరకూ లబ్ధిదారులు ఉంటున్నారు. అందులో గడువు ముగిసినవి వందకు పైగా ఉన్నాయి. గడువు ముగిసిన బాండ్లను నగదుగా ఎలా మార్చుకోవాలో లబ్ధిదారులకు తెలియక సతమతమవుతూ ఐసీడీఎస్ అధికారులను సంప్రదిస్తున్నారు. దీనిపై స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ఏం చేయాలో తెలియక అధికారులు వారికి సర్దిచెప్పి పంపుతున్నారు. అయితే బాలిక సంరక్షణ ద్వారా గడువు ముగిసిన బాండ్లకు డబ్బు చేతికి అందుతుందని, ఆ డబ్బుతో పిల్లల వివాహ ఖర్చులకు ఉపయోగపడతాయని ఆశించిన బాలికల తల్లిదండ్రులకు ప్రభుత్వ వైఖరి నిరాశ మిగులుస్తోంది.

> **నిధులు మంజూరు కాలేదు**
>
> బాలిక సంరక్షణ పథకం కింద గడువు తీరిన బాండ్లను లబ్ధిదారులు కార్యాలయానికి వచ్చి తనకు అందజేస్తే పీడీ కార్యాలయానికి పంపుతా. గతంలో గడువు తీరిన బాండ్లను పీడీ కార్యాలయానికి పంపాం. ఈ బాండ్లపై నిధుల మంజూరు కాలేదు. నిధులు మంజూరు కాగానే లబ్ధిదారులకు అందజేస్తాం.
>
> – సాజిదాభేగం, సీడీపీఓ, తాడిపత్రి



క్లుప్తంగా

వీరభద్రస్వామి ఆలయానికి కేతిరెడ్డి పెద్దారెడ్డి విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దవడుగూరు: మండల కేంద్రం సమీపంలో నూతనం రూపుదిద్దుకుంటున్న వీరభద్ర ఆలయానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రూ.రెండు లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మండల వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ గతంలో ఆలయాభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఇచ్చిన రూ.2 లక్షల నగదును వారు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, దిమ్మగుడి మాజీ ఎంపీటీసీ మోహన్ రెడ్డి, భీమునిపల్లి రామచంద్రారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు సుంకిరెడ్డి, మహేష్‌రెడ్డి, దిమ్మగుడి ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, చిన్నవడుగూరు సర్పంచ్ వెంకటరమణారెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

తాడిపత్రిటౌన్: మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ మానవతా సేవా సంస్థ సభ్యులు తాడిపత్రి పట్టణంలోని కస్తూరిబా పాఠశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఓ మునెమ్మ, సంస్థ అధ్యక్షుడు సత్యప్రసాద్, నాగభూషణంరెడ్డి, సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, బాలఓబులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో ప్రజాస్వామ్యం అపహాస్యం


మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి


గుంతకల్లు: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ముమ్మాటికీ ప్రజాసామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు కూటమి పార్టీలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ వేదికగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేసిన వైఎస్సార్ యువజన విద్యార్థి సంఘం నాయకులపై కేసు పెట్టడం దారుణమన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కేవలం వైఎస్సార్‌సీపీని విమర్శిస్తూ కాలం గడుపుతున్నారు. అసెంబ్లీ పవిత్రను దెబ్బతీసేలా ప్రవర్తించిన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రెడ్డి, నాయకులు మద్దికెర ప్రతాప్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం


పెరటి కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న వెలుగు డీపీఎం గంగాధర్

శింగనమల(నార్పల): వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చని వెలుగు డీపీఎం గంగాధర్ అన్నారు. శనివారం హీఫర్, నవజీవన్ మిషన్ సహకారంతో నార్పలలోని రైతు నేస్తం సంఘం కార్యాలయంలో పెరటి కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు నేస్తం రైతు సంఘంలో ఉన్న 60 మంది రైతులకు ఒక్కొక్కరికీ 10 కోడి పిల్లలతో పాటు 25 కిలోల దాణా సంస్థ ద్వారా ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పోగ్రాం కో–ఆర్డినేటర్ షర్మిల, వెటర్నరీ సిబ్బంది, రైతు సంఘం సిబ్బంది, నవజీవన్ సిబ్బంది పాల్గొన్నారు.

జియో మార్ట్ తనిఖీ


మేనేజర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ

తాడిపత్రి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న జియో మార్ట్‌ను శనివారం జిల్లా లీగల్ మెట్రాలజీ డీఎస్పీ సుధాకర్ తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీకి సంబంధించిన వస్తువుల ధరల వివరాలతో బ్యానర్లు ఏర్పాటు చేయాలని మేనేజర్ హర్షకు సూచించారు. ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వినియోగదారులకు తెలిసేలా బ్యానర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడండి


మాట్లాడుతున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి


సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలో శానిటేషన్ అధ్వాన్నంగా మారడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని వీడి సీరియస్‌గా పనిచేయాలని కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి సూచించారు. శనివారం చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నైరుతిరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో పూడికతీత పనులు చేయించడమేంటి? ఏ సీజన్‌లో ఏ పనులు చేయించాలో కూడా మీకు తెలియదా అని ఆమె కమిషనర్‌ను ప్రశ్నించారు. ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో అధికారపార్టీ నుంచి ఒత్తిళ్లున్నాయని కమిషనర్ బాహాటంగా చెప్పడమేంటని ఆమె నిలదీశారు. ఏకపక్షంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ఆ పార్టీ..ఈ పార్టీ అని భేదాల్లేకుండా అందరినీ సమాన దృష్టితో చూసి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆమె హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సుమోబాషా, లింగన్న మాట్లాడుతూ రిజర్వాయర్లల్లోకి పందులను వదిలిపెడుతున్నా..చేపలు పడుతూ తాగునీటిని కలుషితం చేస్తున్నా చర్యలు ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. పందుల పెంపకందార్లు, చేపలు పట్టే వారిపై చర్యలు చేపడుతామని ఎంతఈ ఇంతియాజ్ హామీ ఇచ్చారు. కౌన్సిలర్ జేసీబీ చాంద్‌బాషా మాట్లాడుతూ పబ్లిక్‌హెల్త్ అధికారులు ధర్మవరం రైల్వే గేట్ వద్ద పైప్‌లైన్ ఏర్పాటు కోసం గుంతలు తవ్వించి, రాకపోకలు బంద్ చేసి ప్రజల్ని ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. మోరీలో ద్విచక్రవాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఆర్‌యూబీ నిర్మాణానికి వీలైనంత త్వరగా చర్యలు చేపట్టాలని కోరారు. కౌన్సిలర్లు పవన్‌గౌడ్, కృపాకర్ మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. అజెండాలోని 7, 23, అనుబంధ అజెండాలోని 3వ అంశాల్ని వాయిదా వేయాలని, మిగతావాటికి ఆమోదం తెలుపుతున్నట్లు పవన్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మైమూన్, వివిధ విభాగాల అధికారులు, కౌన్సిల్, కోఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా


డిజిటల్ బుక్ పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులను వదిలే ప్రసక్తే లేదని, ప్రతి కార్యకర్తకు చట్టపరమైన న్యాయం జరిగేలా చర్యలుంటాయని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. తాడిపత్రిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆయన విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కొంత మంది అధికారులు అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారన్నారు. చట్టం, న్యాయం తో పని లేకుండా టీడీపీ నాయకులు చెప్పిందే వేదంలా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇది ఎంత మాత్రం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అధికార పార్టీ నాయకులు, కొంత మంది అధికారులు చేస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవ్వరు ఎక్కడున్న చట్టప్రకారం ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు. నాయకులు వెంకటరామిరెడ్డి, పేరం ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి, హరినాథరెడ్డి, గడ్డం పరమేష్, నవీన్‌కుమార్‌రెడ్డి, రవికుమార్, ఓబులరెడ్డి, హనుమంతరెడ్డి, సునిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణను మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలి

గుంతకల్లుటౌన్: అసెంబ్లీలో మతిభ్రమించి మాట్లాడిన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ అనానరు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అసెంబ్లీలో హీరో చిరంజీవి, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అసెంబ్లీ సభాసాంప్రదాయాలను కించపరిచేలా బాలకృష్ణ వ్యవహరించారన్నారు. భవిష్యత్తులో నోటికొచ్చినట్లు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఫయాజ్, కార్యదర్శి మహబూబ్‌బాషా, మండల ఉపాధ్యక్షుడు గోవిందు, నాయకులు జాఫర్, అనిల్, జిలాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అబ్దుల్‌బాసిద్

కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి


కేకే అగ్రహారంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ శింగనమల సమన్వయకర్త శైలజానాథ్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం మండలంలోని కేకే అగ్రహారం, సంజీవపురం, బొమ్మలాటపల్లి, చెన్నంపల్లి, నీలాంపల్లిలో ఇంటింటికీ చంద్రబాబు మోసం–మోసపూరిత హామీలు రీకాలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా ప్రజలకు సంతృప్తికరంగా ఒక్క పథకం కూడా అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగయ్య, రామచంద్ర, రామక్రిష్టారెడ్డి, తిప్పారెడ్డి, నారాయణరెడ్డి, ఆదినారాయణ, మల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేష్, కాటమయ్య, భాస్కర్‌రెడ్డి, సురేష్, మల్లేష్, అంజి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రీకాలింగ్ కార్యక్రమం

బుక్కరాయసముద్రం మండలంలో కొట్టాపల్లి, బుక్కరాయసముద్రం, గుజ్జల సరళాదేవి నగర్‌లో ఆదివారం సాయంత్రం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్ రెడ్డి శనివారం తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

'పచ్చ' నేతలకేనా యూరియా?

- సర్వ సభ్య సమావేశంలో రచ్చ

యల్లనూరు: సమస్యలతో సర్వసభ్య సమావేశం హోరెత్తిపోయింది. ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారుల నుంచి సరైన సమాధానం లేక జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి సభను మధ్యలోనే బాయ్‌కాట్ చేసి వెళ్లారు. పాతపల్లి, వెన్నపూసపల్లికి యూరియా సరఫరా కాలేదని ఇన్‌చార్జ్ ఏఓ మధుకుమార్, సొసైటీ సీఈఓ వీరనారప్పను ప్రశ్నించారు. ఎవ్వరికీ తెలియకుండా రాత్రిపూట యూరియా బస్తాలను పచ్చనేతలకు తరలించడమేమిటని మండిపడ్డారు. రైతులు యూరియా బస్తాలను పట్టించే స్థాయికి వచ్చారని ....మీరేం చేస్తున్నారన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, గృహనిర్మాణం, ఆర్‌అండ్‌బీ, ఐకేపీ, ఉపాధిహామీ, విద్యుత్, అంగన్‌వాడీ తదితర శాఖల ప్రాముఖ్యతను అధికారులు వివరించారు. పప్పుశనగ పంటల సాగు సమయంలో యూరియా, డీఏపీని రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే అచ్యుతాపురం గ్రామంలో 15 ఏళ్ల కిందట నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఇప్పటి వరకు అంగన్వాడీ కార్యకర్త విజయలక్ష్మికి అప్పగించకుండా, రేషన్ బియ్యం కోసం ఉపయోగించడం ఏంటని ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణరెడ్డి, చిలమకూరు సర్పంచు నాగరాజు సభలో ఎంపీడీఓ కరుణసాగర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమాదేవి, కోఆప్షన్ మెంబర్ బషీర్, ఎంపీటీసీలు తిమోతి, ఆదినారాయణరెడ్డి, సర్పంచులు జమాల్, నాగరాజు, ఉప సర్పంచు భాస్కర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ జేఈ స్రవంతి, ఎంఈఓ చంద్రశేఖర్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు మునీంద్ర, ఏపీఓ మద్దిలేటి, ఏపీఎం ముత్యాలప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుప్రజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాజామణి, శాంతమ్మ, సీహెచ్ఓ మధుకుమార్, లక్ష్మీనారాయణమ్మ, ఏఓ వాసుదేవరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


యూరియా విషయంలో ఏఓ మధును నిలదీస్తున్న జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఐసీడీ ఎస్ పీడీ నాగమణి

గుత్తి బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీడీ నాగమణి అన్నారు. గుత్తిలోని జంగాల కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పోషణ మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా తమ కులానికి ఎస్సీ కుల సర్టిఫికెట్ ఇవ్వాలని బేడ బుడగ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అశ్వ మారెన్న, జిల్లా అధ్యక్షుడు అశ్వ నాగప్ప, మండల అధ్యక్షుడు యడవల్లి ఈశ్వరయ్య పీడీ నాగమణి, సూపర్‌వైజర్ రాజేశ్వరికి విన్నవించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమా, శోభారాణి ,రత్న పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ బారన్‌సాహెబ్

పెద్దవడుగూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ బారన్ సాహెబ్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన వచ్చిన అరకొర సభ్యులతో, అధికారులతో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా సర్పంచులు శుభ్రం చేయించాలన్నారు. ఏఓ మునికృష్ణ మాట్లాడుతుండగా యూరియా పంపిణీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలికి ఎంపీటీసీ రామన్న అధికారులపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ ఏఈ నెట్టికంటయ్య , అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగేశ్వరి, వెంకటలక్ష్మి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'సమస్యలపై కలసికట్టుగా పోరాడాలి'

గుత్తి: సమస్యలపై కలసికట్టుగా పోరాటం చేయాలని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ పుల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి సూచించారు. గుత్తి మన్రో సత్రంలో శనివారం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యాలయం ప్రారంభమైంది. వారు ముఖ్య అతిథులుగా హాజరై కార్యాలయాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ గుత్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు, రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లోని అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం మనందరం ఒక తాటిపై నిలబడి పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ అడ్వైజర్ నాగ పీరయ్య, స్టేట్ మాజీ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, గుత్తి మండల అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్షావలి, సభ్యులు యోగేంద్ర, వేద మూర్తి, విద్యాధర్, ప్రసాద్, కిష్టయ్య, కోనంకి కృష్ణ, పీరా, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మాతా.. కటాక్షించు..

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఆరోరోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు .

– సాక్షి బృందం


గుంతకల్లులో వేంకటేశ్వరస్వామిగా వాసవీ మాత


సేవాఘడ్‌లో లలిత త్రిపుర సుందరిదేవిగా మాత జగదాంబ


బుగ్గ ఆలయంలో కాత్యాయనిగా అమ్మవారు

రేపు వైఎస్సార్‌సీపీ సమావేశం

శింగనమల: బుక్కరాయసముద్రంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఈనెల 29న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన డిజిటల్ బుక్‌ను విడుదల చేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు చేరేలా అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ శ్రేణులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్: అన్యాయానికి గురైన కార్యకర్తలకు అండగా నిలవడానికి వైఎస్సార్‌సీపీ రూపొందించిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు శనివారం ఓ ప్రకటనలో కోరారు.

మెట్లపై నుంచి పడి మహిళకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో శనివారం ఇంటి మెట్లపై నుంచి పడి పార్వతి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పార్వతి మేడపైన ఉన్న వస్తువులు తెచ్చేందుకు పైకి ఎక్కింది. అనంతరం కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి'

గుంతకల్లు రూరల్: నిర్లక్ష్యంగా కారణంగా ఐదేళ్ల బాలుడి నిండు ప్రాణాలను బలిగొన్న ప్రభుత్వ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు హరిప్రసాద్‌యాదవ్ శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వజ్రకరూరు మండలం చాబాలకు చెందిన హరిజన రాజేష్, సరిత దంపతుల కుమారుడైన అహరోన్ కుమార్ అనే ఐదేళ్ల బాలుడికి తీవ్రజ్వరం, వాంతులు కావడంతో ఈ నెల 25న ఉరవకొండలోని కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారన్నారు. డ్యూటీ డాక్టర్ ఇస్మాయిల్ నిర్లక్ష్యం కారణంగా సరైన వైద్యం అందక తెల్లవారు జామున 3 గంటల సమయంలో బాలుడు మృతి చెందాడరన్నారు. బాలుడి మృతికి కారణమైన వైద్యుడిపై ఉన్నతాధికారుల చేత విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జీఎస్టీ తగ్గింపుతో ఊరట

యాడికి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో ప్రజలకు కాస్త ఊరట కలుగుతోందని డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేశ్వర రెడ్డితో కలిసి మండలంలోని వ్యాపార కేంద్రాల వద్ద సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పథకంపై అవగాహన కలిప్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా సోలార్ ప్లాంట్ ఎలా నిర్మిస్తారు?

యల్లనూరు: బొప్పేపల్లి వాసాపురం పంచాయతీల పరిసరాల్లో నూతనంగా నిర్మిస్తున్న వాసాపురం సోలార్ ప్లాంటుకు డిప్యూటీ ఎంపీడీఓ మనోహర్ బాబు, పంచాయతీ కార్యదర్శి నర్మదలు శనివారం నోటీసులు జారీ చేశారు. పంచాయతీ అనుమతుల్లేకుండా పనులు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. అనధికారిక లేఅవుట్‌లో రోడ్లు, డ్రైయిన్‌లను, సర్వే రాళ్లను 7 రోజుల్లోపు తొలగించడంతో పాటు పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయానికి రాత పూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు. జిల్లా అధికారులకు సిఫార్సు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

నార్పలలో పర్యటించిన డీపీఓ


నార్పల గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజు

శింగనమల(నార్పల): నార్పలలో జిల్లా పంచాయతీ అధికారి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయం వద్ద పరిసరాల్లో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను గ్రామాల్లో చేపట్టాలని, వర్షాలు వస్తున్నందున నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

పామిడి: పట్టణంలో శనివారం స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పాతబస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పామిడి కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యాధికారి జీ శివకార్తిక్‌రెడ్డి, మాజీ సైనికోద్యోగులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ జూదరుల అరెస్టు

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడులో ఆన్‌లైన్ లో మట్కా ఆడుతున్న నలుగురిని శనివారం రాత్రి పోలీసులు అదుపుతోకి తీసుకున్నారు. స్మార్ట్ ఫోన్‌లో ఆన్‌లైన్ మట్కా యాప్ డౌన్ లోడ్ చేసుకుని మట్కా ఆడుతుండగా నల్లయ్య, సుధాకర్, ఎల్లప్ప, సురేష్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,200 నగదు స్వాధనం చేసుకున్నామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మండలంలో మట్కా , పేకాట, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే 944796826 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.